జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 16 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 9

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ: కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం, ఏప్రిల్ 15 ( ప్రజా జ్యోతి ) :**రోడ్డు భద్రతపై ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ – అ లైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం

మిగతా 2 లో...



# విద్యుత్ విప్లవానికి శ్రీకారం

- గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా
- రెండు 33/11 కేవీ ఉప కేంద్రాలతో విద్యుత్ సమస్యలకు చెక్
- సోలార్ గ్రామంగా గండుగులపల్లి – రాష్ట్రానికి ఆదర్శం
- అశ్వారావుపేట నియోజకవర్గం లో విద్యుత్ డివిజన్ కేంద్రం మంజూరు.. భట్టి విక్రమార్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి
- విద్యుత్ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం......ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**దమ్మపేట, ఏప్రిల్.15, (ప్రజా జ్యోతి ):**అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యుత్ రంగంలో సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా కీలక ప్రాజెక్టులను ప్రారంభించిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం దమ్మపేట మండలం జగ్గారం, మల్లారం గ్రామాల్లో రెండు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన జరగగా, గండుగులపల్లి గ్రామంలో మోడల్ సోలార్ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టడం ద్వారా

మిగతా 2 లో...

# గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం మాడవీధుల విస్తరణ పూర్తి చేయాలి

- మంత్రి పొంగులేటి



**భద్రాచలం, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:** దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన మాడవీధుల విస్తరణ పనులను ఆగమ శాస్త్రానుసారం భక్తులకు అనుకూలంగా, విశాలంగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.రానున్న గోదావరి పుష్కరాల నాటికి ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.బుధవారం సాయంత్రం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన మాడవీధుల డిజైన్ పనులను ఆర్కిటెక్ట్ బృందంతో కలిసి మంత్రి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్త రామదాసు నిర్మించిన ఈ పవిత్ర క్షేత్రం భక్తుల అవసరాలకు అనుగుణంగా ఇప్పటివరకు అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవస్థానం అభివృద్ధి కోసం తొలి విడతగా రూ.351 కోట్లు విడుదల చేసి, శ్రీరామనవమి రోజున శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.మాడవీధుల విస్తరణ కోసం సుమారు ఒక ఎకరం 28 గుంటల భూమిని

మిగతా 2 లో...

## మూతపడిన ..ఆరోగ్య..స్వస్థత కేంద్రం..

- ఆయుర్వేద వైద్య సేవలలో అంతరాయం..
- సంవత్సర కాలంగా మూసి ఉన్న ఆయుర్వేద ఆరోగ్య కేంద్రం
- ఆరోగ్య స్వస్థత కేంద్రంలో డాక్టర్ కొరత
- పట్టించుకోని ఆయుష్ శాఖ అధికారులు..!




2 లో...

# నోటీసులు ఇచ్చాం... ఇక పని అయిపోయింది

- డైనేజీలపైనే వ్యాపారాలు చేస్తే పట్టించుకోరా?
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటో!
- నోటీసులు సరే.. చర్యల సంగతేటి!
- కొన్ని ఏళ్లుగా ఆమ్ బజార్ లో డ్రైనేజీలపైనే వ్యాపారాలు!
- అధికారులు ఏమి చేయరనే ధీమాలో ఆమ్ బజార్ వ్యాపారులు!
- అధికారులు కన్నెత్తి చూడని వైనం
- సిబ్బంది చేతనే నోటీసులు అందజేత
- ఆమ్ బజార్ వ్యాపారులు మున్సిపల్ అధికారులకు ఏమైనా ఒప్పందం ఉందా?
- ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారా?
- ఇదెక్కడి తీరని ప్రశ్నిస్తున్న ప్రజలు
- జిల్లా కలెక్టర్ గారూ జర ఆమ్ బజార్ పై దృష్టి సారించరూ!



2 లో...

## రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ: కలెక్టర్ అంకిత్



(మొదటి పేజీ తరువాయి...)

పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. రహదారుల భద్రత మన అందరి బాధ్యత అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నవయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, అవగాహన తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై జిల్లా కలెక్టర్ ఫోకస్





**కొత్తగూడెం, ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం సుజాతానగర్ మండలం మర్రి తండ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో 99 ఇళ్లకు అనుమతులు మంజూరవ్వగా 65 ఇళ్లు పూర్తయ్యాయని మిగతా ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఖర్చులు, ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేబర్ చార్జీలు, అదనపు వ్యయం వంటి అంశాలపై వివరాలు సేకరించిన జిల్లా కలెక్టర్ మూడ్ మౌనిక, హాథిరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉండటంతో లబ్ధిదారులు స్వయంగా పనుల్లో పాల్గొని ఖర్చులను తగ్గించుకుంటున్నారని గుర్తించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల సహాయంతో పాటు స్వంతంగా పెట్టుబడి పెట్టి ఇళ్ల నిర్మాణం చేపడుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. నిర్మాణాలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయో లేదో టేప్‌తో కొలిపించి ధృవీకరించారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం మాడవీధుల విస్తరణ పూర్తి చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

సేకరించామని తెలిపారు. భక్త రామదాసు నిర్మించిన కట్టడాలకు ఎలాంటి భంగం కలగకుండా, ఆగమ శాస్త్ర ప్రకారం నిపుణులైన శిల్పులతో శిల్పకళా నైపుణ్యం ప్రతిఫలించేలా నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. ఆర్కిటెక్ట్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, అర్చకులతో సంపూర్ణంగా సంప్రదించి నాణ్యమైన నిర్మాణ సామగ్రితో పనులు చేపట్టి, పుష్కరాల నాటికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా రూపకల్పన చేస్తున్నామని వివరించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో అధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రి, పనులు శాస్త్రోచితంగా జరగాలని, మాడవీధుల్లో భక్తులకు సౌకర్యవంతంగా పాదచార మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాంక్రీట్ వినియోగాన్ని తగ్గించి రాయి, లోహ పదార్థాలతో నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ప్రాంతంలో సరైన గాలి ప్రసరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి 24 గంటలు పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, టెండర్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ బృందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మూతపడిన ..ఆరోగ్య..స్వస్థత కేంద్రం..




- **ఆయుర్వేద వైద్య సేవలలో అంతరాయం..!**
- **సంవత్సర కాలంగా మూసి ఉన్న ఆయుర్వేద ఆరోగ్య కేంద్రం**
- **ఆరోగ్య స్వస్థత కేంద్రంలో డాక్టర్ కొరత**
- **పట్టించుకోని ఆయుష్ శాఖ అధికారులు..!**

**చర్ల, ఏప్రిల్ 15:(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో అల్లోపతి వైద్య సేవలకు సమాంతరంగా ఆయుర్వేదిక వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకుని వచ్చి ఆయుష్మాన్ భారత్ పథకం కింద తెలంగాణలోని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ప్రారంభించారు. ఈ ఆయుర్వేదిక్ వైద్య సేవలో గ్రామస్తుల లోని మండలంలోని ప్రజలకు చిరు వ్యాధులకు ఆయుర్వేద పద్ధతి ద్వారా వైద్య సేవలు అందించటానికి ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ కేంద్రాలను ప్రారంభించారు. అదేవిధంగా చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామంలో ఆరోగ్య స్వస్థత కేంద్రంను ప్రారంభించి ఆయుర్వేద వైద్య సేవలను గత కొన్ని సంవత్సరాలుగా అందించారు కానీ ప్రస్తుతం సంవత్సరకాలంగా ఈ ఆరోగ్య కేంద్రం మూతపడింది .ఈ సందర్భగా ఆర్ కొత్తగూడెం గ్రామస్తులు , చర్ల మండల వాసులు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానంలో ఆరోగ్య స్వస్థత కేంద్రాలు కొన్ని సంవత్సరాలు పనిచేశాయని గత సంవత్సర కాలంగా ఆసుపత్రి మూతబడిందని గతంలో మెరుగైన వైద్య సేవలు అందించారని దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్య సేవలలో ఉపశమనం కలిగిందని పూర్తిస్థాయిలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం వలన మండల వాసులు గ్రామస్తులు ఆయుర్వేద వైద్య సేవలను పొందలేకపోతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆయుర్వేదిక్ ఆరోగ్య స్వస్థత కేంద్రంలో ఆయుర్వేద డాక్టర్లను నియమించి అల్లోపతి వైద్యానికి సమాంతరంగా ఆయుర్వేద వైద్యంలో కూడా అన్ని రకాల వ్యాధులకి చికిత్సలు అందించవలసిందిగా ఆర్ కొత్తగూడెం గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఆయుర్వేద వైద్య విధానంలో తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ ఉండటం వలన గతంలో చాలామంది ఈ ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకున్నారని ప్రస్తుతం అల్లోపతి మందులలో సైడ్ ఎఫెక్ట్స్ ప్రభావం ఉండటం వలన ఆయుర్వేద విధానంపై తక్కువ ఉండటంతో మన పూర్వీకులు నుంచి వచ్చిన ఆయుర్వేద విధానాన్ని అందరూ వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు పొందుతున్నారని అన్నారు .

ఆర్ కొత్తగూడెం మండలంలో కూడా ఆరోగ్య స్వస్థత కేంద్రంలో ఆయుర్వేద వైద్య నిపుణుని మందులను అందుబాటులోకి తీసుకొని వచ్చి ఎవరికైతే అల్లోపతి మందులు వేసుకోవడం వల్ల ఉపశమనం కలగదో అటువంటి వారు కూడా ఆయుర్వేద మందులతో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందులను ఉపయోగించి ఉపశమనం పొందే అవకాశం ఉన్నదని అధికారులు రాజకీయ నాయకులు సంబంధిత ఆయుష్ ఆయుర్వేద అధికారులు చొరవ తీసుకొని వెంటనే ఆయుర్వేద వైద్య సిబ్బందిని మందులను అందుబాటులోకి తీసుకొని వచ్చి ప్రజలకు ఉపయోగకరంగా ఆరోగ్య స్వస్థత కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఈ సందర్భంగా భద్రాచల నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ ఆర్ కొత్తగూడెం గ్రామంలో గత 20 సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్య సేవలు అందించిన ఆసుపత్రి చుట్టుపక్కల గ్రామాలకు దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సేవలు అందాయని ప్రస్తుతం వైద్యులు అందుబాటులో లేకపోవడం వలన దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్య సదుపాయంకు అంతరాయం ఏర్పడిందని కావున అధికారులు ఆర్ కొత్తగూడెం గ్రామంలోని ఆరోగ్య స్వస్థత కేంద్రానికి ఆయుర్వేద వైద్య నిపుణుని నియమించి చర్ల మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలకు ఆయుర్వేద వైద్య విధానంలో దీర్ఘకాలిక వ్యాధులకు మందులను వైద్య సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# అథ్లెటిక్స్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కే సుజాత
- విజేతలకు మెడల్స్ బహుకరించిన డిప్యూటీ మేయర్, సిరిపురపు లలితకుమారి





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి)** ఇటీవల హన్మకొండలోని జె.ఎన్ స్టేడియంలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్వంచ శ్రీనివాస కాలనీ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో మొత్తం 14 పతకాలు కైవసం చేసుకున్నారు ,ఈ సందర్భంగా బుధవారం జరిగిన అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణతో కఠినంగా శిక్షణ పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని నిరూపించారని అన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచాలని, అలాగే మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి మాట్లాడుతూ, పతకాలు సాధించిన క్రీడాకారులను మెడల్స్ బహూకరించి అభినందిస్తూ, ఈ గ్రౌండ్లో అథ్లెటిక్స్ ఎక్కువమంది బాలికల శిక్షణ పొందటం హర్షణీయమని అలాగే ఈ గ్రౌండ్ కి కావలసిన అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సంజీవ్ రావు మాట్లాడుతూ, ఈ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో నిరంతరం అథ్లెటిక్స్ శిక్షణ కొనసాగుతుందని, ముఖ్యంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎక్కువ పతకాలు సాధించడం ప్రశంసనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనగాల అనంత రాములు , ఈవెంట్ మేనేజర్ రమేష్ అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. మహిధర్ , డిగ్రీ కాలేజ్ పీడీ శ్వేత , చావా రవి పాల్గొన్నారు.

## చేతన మీసేవ ఆధ్వర్యంలో ఘనంగా జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి ,** భద్రాచలం పట్టణంలోని కారుణ్య అనాధ పిల్లల ఆశ్రమంలో కూకట్‌పల్లి జిల్లా కోర్టు జడ్జి మండా వెంకటేశ్వర రావు జన్మదిన వేడుకలు చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాధ పిల్లల కోసం 25 కిలోల బియ్యం, అరటి పండ్లు అందజేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు , పిల్లలు మాట్లాడుతూ, జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదినాన్ని తమ మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జడ్జికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనాధ పిల్లల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం ద్వారా సేవా మనోభావాన్ని చాటిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళీ, ఫోటోగ్రాఫర్ అమ్మ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ బస్తీకి కీర్తి తెచ్చిన సాత్వికకు ఘన సన్మానం



**కొత్తగూడెం, ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )** గురుకుల కళాశాలలో బైపీసీ చదువుతున్న సాత్విక ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 991 మార్కులు సాధించి ప్రతిభ చాటుకుంది. అత్యధిక మార్కులు సాధించిన ఆమె 58వ డివిజన్‌లోని హనుమాన్ బస్తీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చింది. ఈ సందర్భంగా హనుమాన్ బస్తీలోని కమ్యూనిటీ హాల్లో సాత్వికను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాత్విక కృషి పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె విజయంలో తల్లిదండ్రులు సంతోష్‌బాబు, రేణుకల ప్రోత్సాహం ఎంతో కీలకమని అభినందించారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్, మాజీ కౌన్సిలర్లు అంబుల వేణు, వాస భారతి, బస్తీ పెద్దలు ఎండ సీతారాములు, పద్మ, రాజన్న, ఉపాధ్యాయులు అమ్మ మహేష్, చింతల కనకయ్య, నగేష్, గట్టు వేణు, మహమ్మద్ నదీమ్, మొహమ్మద్ అజీమ్ పాషా, వెంకట్ తదితరులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, టవళ్లు పంపిణీ



**మణుగూరు, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి) :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం మజ్జిగ ప్యాకెట్లు, టవళ్లు పీఓ భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా శ్రీ సాయి కన్స్ట్రక్షన్స్, జాబ్ వర్క్స్ కాంట్రాక్టర్లు శ్రీనివాస్, రాజ మనోహర్ లు కార్మికులకు రక్షణ కల్పించే విధంగా ఎండ తీవ్రత వల్ల వచ్చే డీహైడ్రేషన్ ను తప్పించుకునేందుకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టవళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ సిబ్బంది సాంబశివరాజు, హరీశ్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రత... ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామంలో గలట్రాన్స్ కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత తదితర అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిన్నెరసాని సర్పంచ్ వజ్జా రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, పాదచారుల భద్రత వంటి అంశాలపై వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో జాగ్రత్తలు పాటించడం ఎంత ముఖ్యమో విద్యార్థులకు తెలియజేశారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ పీడీ బాల సుబ్రహ్మణ్యం, ఆంగ్ల ఉపాధ్యాయుడు బాలు, ఉపాధ్యాయ సిబ్బంది , పంచాయతీ వర్కర్ కల్తీ రామకృష్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో 989 మార్కులు సాధించిన విద్యార్థిని గుండు పవిత్రకు సత్కారం



**పినపాక,ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఈ బయ్యారం గ్రామానికి చెందిన విద్యార్థిని గుండు పవిత్ర ఇంటర్మీడియట్‌లో 989 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం బుధవారం ఆమెను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లా కలెక్టర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. పవిత్ర తల్లిదండ్రులు సురేష్, శిరీష కూడా ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ నాయకులు బషీరుద్దీన్, గుండు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై చాతకొండలో చిన్నారుల చైతన్యం

- మానవహారం, వ్యాసరచన పోటీలతో సందేశం





**లక్ష్మీదేవిపల్లి , ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )** రోడ్డు భద్రతపై సమాజంలో చైతన్యం తీసుకురావాలంటే చిన్నారుల నుంచే ప్రారంభం కావాలని లక్ష్మీదేవిపల్లి మండలం, చాత కొండ గ్రామ పంచాయతీలో గల చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చాటిచెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విభిన్న అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి రహదారి భద్రత ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాల అవసరం, నిర్లక్ష్యంతో జరిగే ప్రమాదాలపై తమ ఆలోచనలను వ్యక్తపరిచే అవకాశం కల్పించారు. చిన్నారులు తమ రచనల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అవసరాన్ని స్పష్టంగా వివరించడం విశేషం. అనంతరం విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై బలమైన సందేశాన్ని సమాజానికి అందించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించండి – ప్రాణాలను కాపాడుకోండి, సీట్ బెల్ట్ తప్పనిసరి, వేగం ప్రమాదానికి దారి వంటి నినాదాలతో వాహనదారులు, బాటసారులను అప్రమత్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య మాట్లాడుతూ చిన్నారుల్లోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. స్థానిక వార్డు సభ్యులు రావు ప్రమీల, రావు కిరణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామస్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు అధికారుల సమక్షంలో నిరంతరం నిర్వహిస్తే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక సేవకు గుర్తింపు

- మంద కుమార్‌కు 'దళిత రత్న' అవార్డు





**ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో సంవత్సరాలుగా దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సామాజిక కార్యకర్త మంద కుమార్‌కు ప్రతిష్ఠాత్మక 'దళిత రత్న' అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలోబుధవారం భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఈ గౌరవం ఆయనకు దక్కింది. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంద కుమార్, దళితుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ, వారిని చైతన్యపరచడంలో ముందంజలో నిలిచినందుకు ఈ అవార్డు ప్రకటించారు. ఈ అవార్డును తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపెల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. అవార్డు లభించడంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి, ఎర్ర రమేష్, కుక్కల రామకృష్ణ, విజయ్ కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ మంద కుమార్‌ను అభినందించారు.

## డిస్ట్రిక్ట్ జడ్జి పాటిల్ వసంత్‌కు ఘన వీడ్కోలు

- ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



**ఇల్లెందు, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి పాటిల్ వసంత్‌కు ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్, జనరల్ సెక్రటరీ షేక్ మొహమ్మద్ ఖాసిం, కోశాధికారి సపావట్ బన్సిలాల్, న్యాయవాది వేలదండి రామకృష్ణ తదితరులు జడ్జి ని హృదయపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జిగా పాటిల్ వసంత్ అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. న్యాయనిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, సమాజానికి చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. జిల్లా జడ్జిగా పాటిల్ వసంత్ నాయకత్వంలో జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది అందరూ ఐక్యంగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు.జడ్జి విరమణ సందర్భంగా ఇలాంటి సన్మానం నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**బూర్గంపహాడ్,ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి ):**పిల్లలు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉం టారని సీడీపీవో రేవతి అన్నారు.మండలంలోని తాళ్లగొమ్మురులో బుధవారం నిర్వహించిన ఎనిమిదవ పోషణ పక్షంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిశువుల తొలి వెయ్యి రోజుల సంరక్షణ, కిషోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు 'మిషన్ శక్తి' కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, సూపర్వైజర్ సక్కుబాయి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.




# మోసపోయిన యువతి... ప్రియుడి ఇంటి ముందు బైఠాయింపు

- యువతి, యువతి తల్లి పై యువకుడి బంధువుల దాడి!
- ఇల్లెందు మండలం బాలాజీ తండాలో ఉద్రిక్తత
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు





**ఇల్లెందు, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:** ప్రేమ పేరుతో మోసం చేసి ముఖం చాటేసిన యువకుడి ఇంటి ముందు యువతి బైఠాయించిన సంఘటన బుధవారం ఇల్లెందు మండలం ధనియాలపాడు పంచాయతీ బాలాజీ తండా లో జరిగింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రేగుల తండా కు చెందిన భూక్య వెన్నెల తన అమ్మమ్మ స్వగ్రామమైన బాలాజీ తండా లో కొన్ని రోజులు ఉంది. ఈ క్రమంలో బాలాజీ తండాలోని నునావత్ మహేందర్ తో నాలుగేళ్లుగా ప్రేమాయణం కొనసాగింది. ఈ క్రమంలో గత కొంతకాలం గా ప్రేమ వివాహం చేసుకుంటే కట్నం రాదని దురుద్దేశంతో యువతికి దూరమవుతూ వచ్చాడని యువతి కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఫోన్ చేస్తే స్పందించకపోవడం వల్ల యువతి మనస్థాపానికి గురై ఉరివేసుకోని చనిపోయేందుకు సిద్ధపడింది. యువతి తల్లి విషయం తెలుసుకోని యువకుడి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లి చేసేందుకు 4 రోజులుగా యువకుడి స్వగ్రామానికి పెద్దలతో వచ్చింది. 4 రోజులు గా రేపు మాపు అంటూ కాలం వెళ్ళబుచుతున్న తరుణంలో బుధవారం యువతి భూక్య వెన్నెల ప్రియుడు ఇంటి ముందు బైఠాయించింది. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు యువత, యువతి తల్లి పై దాడి చేశారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తో పోలీసులు సంఘటనా స్థలానికి చే రుకున్నారు. ఈ సందర్భంగా యువతి భూక్య వెన్నెల మాట్లాడుతూ తనకు న్యాయం చేయాలని నాలుగేళ్లుగా ప్రే మ పేరుతో మోసం చేశాడని పేర్కొం ది. న్యాయం కోసం ఇంటికి వస్తే తనతో పాటు తన తల్లినీ విచక్షణారహితంగా కొట్టారని ఏడ్చుకుంటూ తెలిపింది. పో లీసులు తగు విచారణ నిర్వహించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.

## అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ





**ఇల్లెందు, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లందు ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లకు ఎమ్మెల్యే సెల్ ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం అందించడం, మంచి అలవాట్లు పెంపొందించడం వంటి విషయాల్లో అంగన్వాడీ టీచర్ల పాత్ర కీలకమన్నారు. గర్భిణీలు, చిన్నారులకు అందించే సేవలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్లు అందించడం ద్వారా సేవల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క నాయకత్వంలో అంగన్వాడీ వ్యవస్థను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందని స్పష్టం చేశారు. ఇల్లందు ఐసిడిఎస్ పరిధిలో 178 మంది అంగన్వాడీ టీచర్లు, 8 మంది సూపర్వైజర్లు, ఒక పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లకు సెల్ ఫోన్ లను అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రతి చిన్నారి బడిబాట పట్టాలంటే అంగన్వాడీ టీచర్ల కృషి అత్యంత అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యలు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయని, త్వరలోనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెల రాజు, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు, బాలాజీ నగర్ సర్పంచ్ పాయం స్వాతి, ఐసిడిఎస్ సిడిపిఓ అరుణకుమారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సైదులు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మిట్టపల్లి సర్పంచ్ గుగులోతు నాగార్జున, నాయకులు బోళ్ళ సూర్యం, తాటి భిక్షం, ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, వార్డు సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ››› ప్రోటోకాల్ పాటించని ఐసిడిఎస్ అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ ప్రజా ప్రతినిధులుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తుంది.

## "అరైవ్ అలైవ్" అవగాహన సదస్సు

- విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ
- రోడ్డు నియమాలు పాటిస్తే భద్రత మీ సొంతం
- సర్పంచ్ బానోత్ సదర్ లాల్



**అశ్వాపురం, ఏప్రిల్ 15, ప్రజా జ్యోతి**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో బుధవారం ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా అశ్వాపురం పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అశ్వాపురం అంబేద్కర్ సెంటర్ దగ్గర జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అశ్వాపురం సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మా ట్లాడుతూ రహదారులపై నిర్లక్ష్యంగా ప్రయాణించడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని రహదారిపై వెళ్లే సమయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని స్పష్టం చేస్తూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో వాటిని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ రామచంద్ర రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగితా వాణి, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## 33.6 కేజీల ఎండు గంజాయి పట్టివేత

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని కొల్లుగూడెం ఇసుక ర్యాంపు వద్ద బుధవారం ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్సై చావా శ్రీహరి, సిబ్బంది కలిసి భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 33.6 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్నారు. అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన కారును తనిఖీ చేయగా దానిలో గంజాయి లభ్యమైంది. దీంతో కారుకు సంబంధించిన వారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించగా ఎవరు కనిపించలేదు. కేసు నమోదు చేసి కారును స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, వీరబాబు, ప్రసన్న కుమార్, తిరుపతి పాల్గొన్నారు.



- డ్రైనేజీలపైనే వ్యాపారాలు చేస్తే పట్టించుకోరా?
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటో!
- నోటీసులు సరే.. చర్యల సంగతేటి!
- కొన్ని ఏళ్లుగా ఆమ్ బజార్ లో డ్రైనేజీలపైనే వ్యాపారాలు!
- అధికారులు ఏమి చేయ రనే ధీమాలో ఆమ్ బజార్ వ్యాపారులు!
- అధికారులు కన్నెత్తి చూడని వైనం
- సిబ్బంది చేతనే నోటీసులు అందజేత
- ఆమ్ బజార్ వ్యాపారులు మున్సిపల్ అధికారులకు ఏమైనా ఒప్పందం ఉందా?
- ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారా?
- ఇదెక్కడి తీరని ప్రశ్నిస్తున్న ప్రజలు
- జిల్లా కలెక్టర్ గారూ జర ఆమ్ బజార్ పై దృష్టి సారించరూ!

# నోటీసులు ఇచ్చాం... ఇక పని అయిపొయింది




**ఇల్లందు, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**" పెట్టేవాడు మనవాడైతే.... ఈ మూలకు కూర్చున్న కడుపునిండా వడ్డిస్తాడని నానుడి మాట ప్రస్తుతం ఇల్లందు మున్సిపల్ శాఖను చూస్తే నిజమని నమ్మక తప్పదు.... పట్టణం లోని ఆమ్ బజార్ లో కొన్ని ఏళ్లుగా డ్రైనేజీలపై కొనసాగుతున్న వ్యాపారాలపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తుంది. డ్రైనేజీలపైనే దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నా, అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి డ్రైనేజీలపైనే వ్యాపారాలతో పాటు చిన్నపాటి నిర్మాణాలు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులకు కనిపించడం లేదా ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి.

### డ్రైనేజీలపైనే వ్యాపారాలు...

ఆమ్ బజార్ లో అనేక దుకాణాలు నేరుగా డ్రైనేజీలపైనే ఏర్పాటు కావడం వల్ల పరిసరాలు అస్వచ్ఛంగా మారుతున్నాయి. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారుల నుంచి కఠిన చర్యలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

### నోటీసులు సరే... అమలు ఎక్కడ?

మున్సిపల్ సిబ్బంది తరచూ నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, వాటి అమలు మాత్రం కనిపించడం లేదు. "నోటీసులు ఇచ్చాం" అనే మాటతోనే అధికారులు బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

### అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?

ఆమ్ బజార్ లో ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు వ్యాపారులతో లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఆమ్ బజార్ లో గత కొన్ని నెలల క్రితం ఏర్పాటుచేసిన వస్త్ర దుకాణానికి సంబంధించి జనరేటర్ ను సైతం మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు అనేది కండ్లకు కనిపిస్తుందని పలువురు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాలు చేసినప్పటికీ కేవలం నోటీసులతోనే సరిపెడతారనే అపవాదు ఆ శాఖపై లేకపోలేదు.

### సిబ్బంది చేతనే నోటీసులు... పైస్థాయికి తప్పదారి?

నోటీసులు కేవలం సిబ్బంది స్థాయిలోనే జారీ అవుతున్నాయని, ఉన్నతాధికారులకు అసలు పరిస్థితి గురించి పూర్తి సమాచారం అందడం లేదని స్థానికులు అంటున్నారు. పైస్థాయికి తప్పుడు సమాచారం చేరుతున్నదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు అక్కడి పరిస్థితి గురించి పూర్తి అవగాహన ఉన్నట్లయితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది తెలియాల్సి ఉంది.

### అధికారులను లెక్కచేయని వ్యాపారులు..?

"ఎవరూ ఏమీ చేయరనే" ధీమాతో వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నోటీసులను పట్టించుకోకుండా వ్యాపారాలు కొనసాగించడం దీనికి ఉదాహరణగా నిలుస్తుంది. ఆమ్ బజార్ లో కొన్ని ఏళ్ల నుండి మున్సిపల్ డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాలు చేపట్టినప్పటికీ మున్సిపల్ అధికారులకు నేటి వరకు కనిపించకపోవడం విచారకరం. చిన్నపాటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఏమైనా నిర్మాణాలు చేసుకుంటేనే అనుమతులు లేవని మున్సిపల్ సిబ్బంది ఆగమేఘాలపై అక్కడ ప్రత్యక్షమై మీ ఇంటి నిర్మాణాలను నిలిపివేయాలని, నిర్మాణాలకు సంబంధించి మున్సిపల్ కార్యాలయం నుండి అనుమతులు లేవని చెప్పడం సర్వసాధారణం. బడా వ్యాపారులకు ఒక న్యాయం... పేద, మధ్యతరగతి వారికి మరొక న్యాయం ఉంటుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### తీవ్ర ట్రాఫిక్ జామ్

ఆమ్ బజార్ పూర్తిగా ఇరుకు ఇరుకుగానే ఉంటుంది. ఇల్లందు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ వారి వారి అవసరాల నిమిత్తం ఇల్లందుకు వస్తుంటారు. ముఖ్యంగా ఇల్లందు వ్యాపారం అంత ఆమ్ బజార్ కేంద్రంగానే కొనసాగుతుంది. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ఆమ్ బజార్ లో సంచరించడంతో పాటు వివిధ రకాల వస్తువుల కొనుగోలులను రవాణా చేసేందుకు వాహనాలు సైతం వస్తుంటాయి. దీంతో ఆ వాహనాలు... ఆటోలు... ద్విచక్ర వాహనాలు... ప్రజలు సంచరించటంతో తీవ్ర ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగుతుందనేది వాస్తవం. ఆమ్ బజార్ లో ఒక పక్క డ్రైనేజీలపై వ్యాపారాలు, కొద్దిపాటి నిర్మాణాలు ఒక భాగమైతే, మరోపక్క వివిధ రకాల చిరు వ్యాపారులు వారి తోపుడు బండ్లను ఉంచడంతో ట్రాఫిక్ కు మరింత అంతరాయం కలుగుతుంది.

### కలెక్టర్ గారు స్పందించరూ...

ఇల్లందు ఆమ్ బజార్ డ్రైనేజీలపై వ్యాపారాలు, ఆపై కొద్దిపాటి నిర్మాణాలు చేపట్టి గత కొన్ని ఏళ్ల నుండి భారీ స్థాయిలో వ్యాపారాన్ని కొనసాగిస్తున్న వాటిపై జిల్లా కలెక్టర్ తో పాటు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని, ఆమ్ బజార్ లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీలపై వ్యాపారాలను తొలగించి, పట్టణంలో శుభ్రత, భద్రతను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏది ఏమైనా ఇల్లందు ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై వ్యాపారాలు, కొద్దిపాటి నిర్మాణాలపై ఇకనైనా స్థానిక మున్సిపల్ అధికారులు ఎలా స్పందిస్తారో... ఇలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



## విద్యుత్ విప్లవానికి శ్రీకారం





(మొదటి పేజీ తరువాయి...)

గ్రామాన్ని విద్యుత్ స్వావలంబన దిశగా తీసుకెళ్లే చారిత్రాత్మక కార్యక్రమనికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అత్యవసరమని, రైతులు ఎలాంటి అంతరాయం లేకుండా సాగు చేసుకునేలా విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జగ్గారం, మల్లారం ప్రాంతాల్లో రూ.5 కోట్ల వ్యయంతో ఈ ఉపకేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది రైతులకు, గృహ వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తూ, సుమారు 422 ఇళ్లకు సోలార్ విద్యుత్ అందించేందుకు రూ.23 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గ్రామ స్థాయిలో విద్యుత్ స్వావలంబన సాధించడానికి దోహదపడటమే కాకుండా భవిష్యత్ లో ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అదనంగా విద్యుత్ లైన్లు, పాత పోల్స్ పునరుద్ధరణకు రూ.8 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఆహార భద్రత కోసం వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ వసతి కల్పిస్తున్నామని చెప్పారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని వివరించారు.

### విద్యుత్ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. పాత విద్యుత్ లైన్లను తొలగించి కొత్త పోల్స్ ఏర్పాటు చేయడం అత్యవసరమని, రైతులు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ సేవలను మెరుగుపరచేందుకు ప్రత్యేక డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఎన్పీడీసీఎల్ సిఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఉపకేంద్రాల ద్వారా సుమారు 6 వేల మందికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లోడును సమర్థంగా నిర్వహించే విధంగా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని చెప్పారు.

### ఈ ఉప కేంద్రాల ద్వారా నాలుగు వేల మంది రైతులకు ఉపయోగం... జిల్లా కలెక్టర్ అంకిత్

ఈ ఉపకేంద్రాల ద్వారా సుమారు 4 వేల మంది రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో లోవోల్టేజ్, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. గండుగులపల్లి సోలార్ ప్రాజెక్ట్ విజయవంతమైతే ఇతర గ్రామాలకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం గండుగులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ సోలార్ ప్లాంట్ ను ప్రారంభించి, సోలార్ మీటర్ ను ఆన్ చేసి గ్రామానికి విద్యుత్ సరఫరాను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిని కలిసి భద్రాద్రి బార్ అసోసియేషన్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15 , ప్రజాజ్యోతి,** హైకోర్టు న్యాయమూర్తి బీమపాక నగేష్‌ను బుధవారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసారు. ఈ సందర్భంగా భద్రాచలం ప్రాంతంకు సంబందించిన న్యాయ సేవల అభివృద్ధి అంశం గురించి వినతిపత్రం సమర్పించారు. ఈ సమయంలో భద్రాచలం కేంద్రంగా ఒక సెషన్స్ కోర్టు లేదా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏరాప్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పందించిన న్యాయమూర్తి నగేష్ ఈ సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ఉపాధ్యక్షులు సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాస చారి, సంయుక్త కార్యదర్శి తాత లలిత, లైబ్రరీ కార్యదర్శి పగడాల కవిత, సాంస్కృతిక కార్యదర్శి కోర్స కృష్ణార్జునరావు, న్యాయవాదులు న్యాయవాదులు ఎం.వి. రమణరావు, కోట దేవదానం, గొడపర్తి నాగరాజు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందికి నజరానా



**బూర్గంపహాడ్, ఏప్రిల్15 (ప్రజా జ్యోతి):** ఉపాధి హామీ పథకంలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం నజరానా ప్రకటించింది. గ్రామాల్లో కూలీలకు అత్యధిక సంఖ్యలో పని కల్పించి, నిబంధనల ప్రకారం హాజరు నమో దు చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బూర్గంపాడు మండలం ఉప్పుసాక ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను అడిషనల్ డిఆర్డిఓ రవి కుమార్ చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదును బుధవారం అందుకున్నారు.

## తప్పిపోయిన వ్యక్తిని అప్పగించిన ఆటో డ్రైవర్




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15, ప్రజా జ్యోతి,** భద్రాచలలో తప్పిపోయిన వ్యక్తి గు రించి సామాజిక మాద్యమాల్లో ప్రచారం చేయగా గమనించిన ఆటో డ్రైవరు ఆ వ్యక్తిని నేరుగా పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించిన సంఘటన ఇది. భ ద్రాచలంలో రామాలయ దర్శనం కోసం వచ్చిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యుల నుం చి విడిపోయి ఎటువెళ్లాడో అర్థం కాలేదు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు ఈ విషయమై స్థానిక వాటసప్ గ్రూపుల్లో విస్తృత ప్రచా రం చే శారు. దీంతో రాజుపేట కాలనీకి చెందిన బానోతు ఆనంద్ అనే ఆటో డ్రై వరు తప్పియిన వ్యక్తి తనకు తారస పడటంతో ఆ వ్యక్తిని నేరుగా పోలీసు స్టే షన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. దీంతో భద్రాచలం సీఐ నాగ రాజు, ఎస్సె జి. స్వప్న లు అభినందించి ఆనంద్‌కు నగదు పారితోషకం బమతిగా అందెజేయడంతో పాటు పోలీసు శాఖకు సహకరించిన ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.

## 18న డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న భారీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ తెలిపారు. ఈ జాబ్ మేళాలలో విజయ బయో ఫెర్టిలైజర్స్, అక్షయ హెచ్‌ఆర్ సర్వీసెస్, వారు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. పదో తరగతి నుంచి ఐఐటీ, డిగ్రీ, సాంకేతిక అర్హతల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగి అన్ని అర్హతల సర్టిఫికెట్లతో 18న ఉదయం 10 గంటల నుంచి హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

# ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీం

- **కొమరం భీం ఆశయ సాధనకు పునరంకితం కావాలి**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**






**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి)** ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీం అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పాల్వంచ మండలం తొగ్గూడెం గ్రామంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన కొమరం భీం విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నైజాం నవాబుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, అడవి బిడ్డల హక్కుల కోసం 'జల్ జంగల్ జమీన్' అనే నినాదంతో కొమరం భీం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. నేటి సమాజంలో కూడా ఆదివాసీల భూములపై, అటవీ సంపదపై దాడులు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టడానికి భీం చూపిన పోరాట పటిమ అవసరమని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వారి హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా యువతకు వారి చరిత్రను వివరించినట్లవుతుందని తెలిపారు. కొమరం భీం త్యాగం వృధా పోనివ్వకుండా, దోపిడీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని సాబీర్ పాషా కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు. జర్పుల మోహన్. బాదావత్ శ్రీనివాస్. కొమరం ప్రకాష్ నిడమనూరు శివరామకృష్ణ. పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు రూ.1.56 కోట్ల హౌండీ ఆదాయం

- **నెల వ్యవధిలోనే రూ.కోటి మార్కు దాటిన హౌండీ ఆదాయం**



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి రూ.1,56,91,971 కోట్ల హౌండీ ఆదాయం సమకూరింది. బుధవారం రామాలయంలోని చిత్రకూట మండపంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆద్వర్యంలో ఆలయంలోని హౌండీ లను తెరిచి లెక్కింపు నిర్వహించారు. ఈ సమయంలో రూ.1,56,91,971 నగదు 0.071 గ్రాముల బంగారం, ఒక కేజీ 280 గ్రాముల వెండి హౌండీ ల ద్వారా లభించాయి. అలాగే 196 మలేషియా రింగిట్స్, 100 యుఏఈ దీరామ్స్, 80 ఇంగ్లాండ్ పౌండ్స్, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 34 యుఎస్ డాలర్లు, 50 సౌదీ రియాన్స్ విదేశీ కరెన్సీ హౌండీ ల్లో లభించింది. హౌండీ ఆదాయం లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేశారు. హౌండీ లను చివరగా మార్చి 9న లెక్కింపు నిర్వహించగా మళ్లీ 36 రోజుల అనంతరం బుధవారం లెక్కింపు నిర్వహించారు. కాగా మార్చి నెలలో శ్రీరామనవమి, సెలవుదినాలు ఎక్కువగా ఉండటంతో హౌండీ ఆదాయం అధికంగా లభించింది. మార్చి 9న లెక్కించిన హౌండీ ద్వారా రూ.1,05,94,090 లభించగా ఈసారి 5,097,881 ఆదాయం అదనంగా లభించింది.

## రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 15,(ప్రజా జ్యోతి):** రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అరైవ్ అలైవ్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెల్మెంట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకోవద్దని అన్నారు. తరుచు కొందరు మైనార్లు వాహనలు నడపడం వల్ల ప్రమాధాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు ఇన్సరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబదించిన పత్రాలు దగ్గర ఉండేలా చూడలన్నారు. ప్రమాదం జరిగిన తరవాత బాధపడే కన్నా ప్రమాదం బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో ఎదు సింహరాజు, సర్పంచ్ మంద నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై త్రివేణి పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు

**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక త్రివేణి పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రత మన బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం డీఎస్పీ అదినారాయణ, చుంచుపల్లి సర్కిల్ సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎంఈఓ కృష్ణయ్య, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు వేగ పరిమితుల ప్రాముఖ్యత డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల జరిగే ప్రమాదాలపై వివరించారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఇందులో ఎస్. నవనీత శ్రీ (9వ తరగతి), ఎ. అమితా వాత్సల్య (9వ తరగతి), ఎస్. సహస్ర (9వ తరగతి), ఎ. శ్రీకర్ (3వ తరగతి) విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరె







క్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీశ్, సీఆర్ ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్స్ వి. సూర్యనారాయణమూర్తి, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్యతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లిలో అభివృద్ధి స్తంభనం!

- కేంద్ర నిధులు ఉన్నా పనుల్లో పురోగతి శూన్యం
- గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రజల ఎదురుచూపులు
- కమిషన్ల కోసం పనులు నిలిపివేత..?
- సుమారు రూ.2 కోట్ల పనులు పెండింగ్
- నిధులు మురుగుతున్నాయన్న విమర్శలు





**కొత్తగూడెం, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి)** లక్ష్మీదేవిపల్లి మండలంలో అభివృద్ధి పనులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ( మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ) కేంద్ర నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు మాత్రం కదలికలేకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీల్లో రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంఖుస్థాపనలు చేసి దాదాపు ఎనిమిది నెలలు గడిచినా పనులు ముందుకు సాగకపోవడం చర్చనీయాంశమైంది. రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి సరఫరా, పాఠశాల భవనాల మరమ్మతులు వంటి అత్యవసర పనులు కాగితాలకే పరిమితమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు ఉన్నప్పటికీ పనులు నిలిచిపోవడానికి కారణాలపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నా పరిష్కారం లేకపోవడం తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది.

**రాజకీయ నేత నిర్వాహకంపై ఆరోపణలు**

మండలంలో అభివృద్ధి పనుల అమలులో ఓ రాజకీయ నేత నిర్వాహకంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో చేపట్టాల్సిన పనులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆలస్యం చేస్తున్నాడనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా, పాఠశాల భవనాల మరమ్మతులు వంటి కీలక పనులకు నిధులు కేటాయించినప్పటికీ, అమలులో పురోగతి కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కమిషన్ల కోసం పనుల అడ్డుకట్ట..?**

కాంట్రాక్టుల కేటాయింపులో కమిషన్లు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషన్ ఇస్తేనే పని అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని మారుమూల గ్రామాల్లో సబ్ కాంట్రాక్టర్ల ద్వారా పనులు జరుగుతుండగా లక్ష్మీదేవిపల్లి పరిధిలోని పలు గ్రామాల్లో పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఒకే మండలంలో ఇలాంటి అసమానతలు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. మండల వ్యాప్తంగా సుమారు రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ అమలు లేకపోవడంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి..?**

కాలపరిమితిలో పనులు పూర్తి కాకపోతే ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ( మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ) కేంద్ర నిధులు తిరిగి వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సమయకాలం ముగింపు జరగడం తో అధికారులు మరొక నెల వ్యవధి కాలంలో పనులు పూర్తి చేయాలనీ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదని గ్రామీణ అభివృద్ధికై కేటాయించిన నిధులు వెనకకు వెళ్లేందుకు ఆలస్యం అధికంగా ఉండటంతో నిధులు మురుగుతున్నాయన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ప్రజల కోసం కేటాయించిన నిధులు వినియోగం కాకపోతే దానికి బాధ్యత ఎవరు వహించాలనే ప్రశ్న ముందుకు వస్తోంది. అభివృద్ధి పేరుతో నిధులు తీసుకుని పనులు చేయకపోవడం దురదృష్టకరమని మండల వాసులు మండిపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్ పనులను పూర్తి చేయించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అభివృద్ధి కోసం సహకరించండి సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:** గ్రామ అభివృద్ధి కోసం చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు గ్రామ ప్రజలు సహకరించాలని సర్పంచ్ కుంజా వినోద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్ అండ్ బి మరియు పంచాయతీరాజ్ శాఖ అధికారులు రోడ్డు విస్తరణలో భాగంగా బుధవారం రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ, జగన్నాధపురం గ్రామంలో మెయిన్ రోడ్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు గత నెల 6వ తేదీన అధికారులు ఇచ్చిన నోటీసు మేరకు ఆర్ అండ్ బి పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. గ్రామ అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ కార్యక్రమానికి అందరూ మద్దతు ఇవ్వాలని, ఎటువంటి సందేహాలు లేకుండా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ ఇబ్రహీం, గ్రామ పెద్దలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాపార స్థలాలపై అధికారుల దౌర్జన్యం ఆపాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్



**ములకలపల్లి ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:** జగన్నాథపురం గ్రామంలో రోడ్ విస్తరణ పేరుతో చిన్న వ్యాపారుల స్థలాలపై అధికారుల దౌర్జన్యం కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సరైన ప్రణాళిక గాని, నిధుల కేటాయింపు లేకుండా రోడ్ విస్తరణ చేపడుతున్న తీరు "ఆలు లేదు పోలు లేదు – అల్లుడు పేరు సోమలింగం" అన్నట్లుగా ఉందని విమర్శించారు. రోడ్ విస్తరణకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయా? సరైన అంచనా (ఎస్టిమేషన్) సిద్ధం చేశారా? అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు. నిబంధనల ప్రకారం రోడ్ విస్తరణ చేపట్టాల్సి వస్తే, సంబంధిత భూస్వాముల అనుమతులు తీసుకున్నారా అని ప్రశ్నించారు. నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూ సేకరణ చేయడం, నిర్మాణంలో ఉన్న ఇళ్లను కూల్చివేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన నిలదీశారు. "ఇది ప్రజా ప్రభుత్వమా? లేక బుల్డోజర్ ప్రభుత్వమా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ విస్తరణ పేరుతో వ్యాపారులను నిబంధనలకు విరుద్ధంగా ఇబ్బందులకు గురి చేస్తే, బాధితుల పక్షాన సీపీఐ పార్టీ నిలబడుతుందని నరాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

## పోటు రంగారావు పై పెట్టిన దేశద్రోహం కేసును ఎత్తివేయాలి : మాస్ లైన్




**గుండాల మార్చి. 15 ప్రజా జ్యోతి** <సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పోటు రంగారావు పై పెట్టిన దేశద్రోహం కేసును వెంటనే ఎత్తివేయాలని మాస్ లైన్ మండల కార్యదర్శి కొమరం శాంతయ్య నాయకులు తెల్లం రాజు లు ప్రకటనలో పేర్కొన్నారు, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇచ్చిన అక్రమ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని, కోరుతూ ఆ పార్టీ బుధవారం ప్రకటన విడుదల చేసింది, బిజెపి ఆర్ఎస్ఎస్ కేంద్ర ప్రభుత్వ అధినేతలు మోడీ అమిత్ షా అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై కక్షపూరిత రాజకీయం చేస్తూ అక్రమ కేసులను బనాయిస్తూ ఉన్నారని దీని ఖండించాలన్నారు అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నాడని, ఇటువంటి ఆధారాలు లేకున్నా కుట్ర కేసులు పెడుతూ నారని, అక్రమంగా నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలు, మారణకాండలను, ప్రశ్నించి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలను మనిషి చేస్తున్నందుకు తుడిచి పెడుతున్నందుకు, వ్యతిరేకిస్తున్నందుకు, నిరసన తెలియజేస్తున్నందుకు సహించలేక బంధించేందుకు ప్రభుత్వం అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తూ ప్రజా ఉద్యమాలను అణచివేస్తుందని విమర్శించారు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ చట్టబద్ధంగా బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతుందని ప్రజా పోరాటాల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయాణించాలని కానీ ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు గురి చేయడం సరికాదని అన్నారు

## అప్పారావుపేట పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం

- మెయింటెనెన్స్ పూర్తి – పామ్ ఆయిల్ గెలల స్వీకరణకు సిద్ధం



**దమ్మపేట, ఏప్రిల్.15, (ప్రజాజ్యోతి):** అప్పారావుపేట పామ్ ఆయిల్ ఫ్యాక్టరీలో నిర్వహించిన మెయింటెనెన్స్ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని ఏప్రిల్ 16వ తేదీ గురువారం నుండి యధావిధిగా కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఫ్యాక్టరీ మేనేజర్, అశ్వరావుపేట ఫ్యాక్టరీ డిప్యూటీ మేనేజర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల డివిజనల్ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, రైతులు తమ పామ్ ఆయిల్ గెలలను తిరిగి అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలని కోరారు. ఫ్యాక్టరీ కార్యకలాపాలు పునఃప్రారంభం కావడం వల్ల రైతులకు మరింత సౌలభ్యం కలుగుతుందని, పంట దిగుబడులను సమయానికి విక్రయించుకునే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు. రైతులు ఫ్యాక్టరీతో సహకరించి పరస్పర అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభం కావడంతో ప్రాంతీయ రైతులకు ఊరటనిచ్చే పరిణామంగా మారింది.

# పెండింగ్‌లో ఉన్న బి ఎల్ వో ల నగదు చెల్లించాలి

- •అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ







**చర్ల, ఏప్రిల్ 15:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం సిఐటియూ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్స్ 2024 నుండి పెండింగ్‌లో ఉన్న బి ఎల్ వో ల డ్యూటీ నగదును చెల్లించాలని, బిఎల్వో డ్యూటీల నుండి అంగన్వాడీ టీచర్స్ ను మినహాయించాలని సిఐటియు అనుబంధ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గిరిగాని పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి జిల్లా కార్యదర్శి గిరిగాని పద్మ మాట్లాడుతూ బూత్ లెవెల్ డ్యూటీలు చేసిన అంగన్వాడీ టీచర్స్ ను అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్ చేసి ఓటు చేర్పింపులు, మార్పులు, డిలీటెడ్ ఆధార్ కార్డులు, పాస్ ఫోటోలు, 6, 7 ,8 ఫామ్ లతో ఇంటింటికి తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పనులు ఒకేసారి చెప్పకుండా ఇష్టానుసారం చెబుతుండటంతో చేసిన పనే పదేపదే చేయాల్సి వస్తోందని, వారి సమయమంతా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరగడానికే సరిపోతోందని తెలిపారు. ఇటువంటి పనుల వలన మండలంలోని వివిద ప్రాంతాలలో ఉన్న టీచర్లు చర్లకు రావాలంటే ఆటో కిరాయిల కారణంగా ఆర్థిక బారాన్ని ఎదుర్కొంటుంన్నారని వాపోయారు. ఈ విషయమై ఇప్పటికే అనేకమార్లు వినతిపత్రాలను అందచేసినా అధికారులలో చలనం లేదని మండిపడ్డారు. ఒకపక్క అంగన్‌వాడీ విదులు మరో పక్క బిఎల్వో విదులతో టీచర్లు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే అధికారులే తమ వద్దకు వచ్చి సేకరించాలని, అధికారుల బెదిరింపులు ఆపాలని, మహిళా ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి బిఎల్వో విదుల నుండి తొలగించాలని డిమాండ్ చేసారు. లేకుండా ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు, సిఐటియూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నాయకురాలు ఎం విజయశీల, కమల మనోహరి, అనసూయ, నాగమణి, పుష్ప, సుగుణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ఎర్రగుంటలో అవగాహన కార్యక్రమం

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం
- విద్యార్థుల్లో చైతన్యం కోసం పోటీలు, బహుమతుల ప్రదానం







**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 15, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో గల ఎర్రగుంట ప్రధాన కూడలిలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మానవహారం, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కావూరి మహాలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ విజయసింహా రెడ్డి, పెద్దిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వం, లేఖ రచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎర్రగుంట ప్రధాన కూడలిలో విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కలిసి మానవహారం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు నడపనివ్వకూడదని సూచించారు. సబ్ ఇన్స్పెక్టర్ విజయసింహా రెడ్డి రోడ్డు భద్రత నియమాలను వివరించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి సమావేశమైన వారితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు వేముల రమణ, బసవయ్య, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, ప్రయాణదారులు పాల్గొన్నారు.

# వాహనదారుల ఆలోచన మారాలి

- అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నవారు ఆచరించాలి
- చిన్న తప్పుకి ప్రాణాలను పణంగా పెట్టొద్దు
- విపత్తు మరణాల కంటే రోడ్డు ప్రమాద మరణాలే ఎక్కువ.... రోహిత్ రాజ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ
- ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు
- రహదారుల భద్రత... మనందరి బాధ్యత... జారే ఆదినారాయణ అశ్వారావుపేట శాసన సభ్యులు







**అశ్వారావుపేట, ఏప్రిల్ 15, ప్రజా జ్యోతి :** వాహనదారుల్లో, ప్రజల్లో ఆలోచన మారాలని చిన్న తప్పులతో ప్రాణాలను పణంగా పెట్టే పనులను మానుకోవాలని ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేసిన ప్రజల ఆలోచన మారకుంటే ఉపయోగం లేదని, విపత్తుల ద్వారా సంభవించే మరణాల కంటే రోడ్డు ప్రమాద మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించినందుకు అశ్వారావుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ –అలైవ్ భాగంగా భద్రాచలం రోడ్డు లోని శ్రీ శ్రీ కళ్యాణ వేదికలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల వలన 1.75 లక్షల మంది చనిపోయారని, మరణాల సంఖ్య ఏ స్థాయిలో ఉందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. రహదారుల భద్రత అన్ని శాఖలకు సంబంధించిందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారిద్దామన్నారు. మద్యం తాగి ఆ మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని సాయంత్రం సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, మద్యం సేవించి వాహనాలు నడపడమే కారణమన్నారు. గత ఏడాది మన జిల్లాలో తొలి మూడు నెలల్లో రోడ్డు ప్రమాదాల్లో 78 మంది చనిపోతే ఈ సంవత్సరం 52 మంది చనిపోయారని 26 మందిని కాపాడుగలిగామన్నారు. మన ఇంట్లో జరగట్లేదు అని అశ్రద్ధగా ఉండొద్దని ఒక కుటుంబంలో సంపాదించే పెద్ద,లేదా సంపాదనకు అవకాశం ఉన్న కుమారుడు చనిపోతే ఆ కుటుంబమే రోడ్డుపైకి వస్తుందన్నారు. రహదారి నియమాలను పాటిస్తూ మనతో పాటు మరికొందరిని చైతన్యపరిస్తే మన వల్ల కొన్ని ప్రాణాలను కాపాడిన చాలన్నారు.

> ››› **రహదారుల భద్రత... మనందరి బాధ్యత... జారే ఆదినారాయణ ఎమ్మెల్యే**

రహదారి నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. అరైవ్ – అలైవ్ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన మనతోపాటు అవతల వ్యక్తులకు కూడా ప్రాణాపాయం కల్పించిన వారమవుతున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాదం జరిగినప్పుడు రిస్క్ తక్కువగా ఉంటుందన్నారు. అందరూ అవగాహనతో పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతిజ్ఞ పునాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చైర్ పర్సన్ జూపల్లి శశికళ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ డిఎస్పి సతీష్ కుమార్,సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎస్ ఐ యాయాతి రాజు అదనపు ఎస్సై అఖిల పలు అధికారులు పాలక వర్గ సభ్యులు సర్పంచులు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఏజెన్సీలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివి.
- అమ్మ జన్మనిస్తే రక్తదనం పునర్జన్మని ప్రసాదిస్తుంది.
- భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి
- రక్త కొరత లేని సమాజమే లక్ష్యం: ట్రస్ట్ చైర్మన్ మురళి





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15, ప్రజా జ్యోతి,** ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణీలు, తలసేమియా మరియు సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదాతలు ముందుకు రావడం శుభ పరిణామమని భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కొప్పుల మురళి జన్మదినాన్ని పురస్కరించుకుని, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.






### ››› మానవత్వానికి నిలువుటద్దం 'కొప్పుల మురళి'

ఈ సందర్భంగా ఆర్ఎంఓ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క ఇబ్బంది పడే గర్భిణీలకు, తలసేమియా సికిల్ సెల్ అనీమియా చిన్నారుల కు ,ప్రమాద బాధితులకు కొప్పుల మురళి ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని కొనియాడారు. రక్తం అవసరం అనగానే ఈ ఏజెన్సీ ప్రాంతంలో గుర్తొచ్చే మొట్టమొదటి పేరు కొప్పుల మురళి అని అన్నారు ."ఏ సమయంలో ఫోన్ చేసినా వెంటనే స్పందించి రక్తాన్ని సమకూర్చడంలో మురళి చూపే చొరవ వేల మందికి పునర్జన్మ ప్రసాదించింది. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివి" అని కొనియాడారు. ఈ శిబిరంలో సుమారు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు.

### ››› రక్త కొరత లేని సమాజమే లక్ష్యం: కొప్పుల మురళి

ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ.. ఆడంబరాలకు పోకుండా ప్రతి ఏటా తన పుట్టినరోజున రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా పొందే సంతృప్తి వేరని అన్నారు. ఏజెన్సీలో తలసేమియా చిన్నారులు రక్తం కోసం పడుతున్న ఇబ్బందులను చూసి చలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చి 'రక్త కొరత లేని సమాజం' నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎడ్విన్ కిషోర్, సాయి కుమార్, బాలరాజు, సారయ్య, బాబాజీ, చైతన్య, హరికృష్ణ, నవీన్ మరియు బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు చందు, శ్రీను, పాషా తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ చేసిన బిజెపి నేతలు





**కొత్తగూడెం, ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )**డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ చేసి సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి, శాలువాలు కప్పి, స్వీట్లు పంచి గౌరవించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, ఉమ్మడి ఖమ్మం జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు జీ.వి.కె. మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టణ పరిశుభ్రతలో వారి సేవలు అమూల్యమని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల కోసం కష్టపడ్డారని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జాటోత్ వెంకట్, నరేంద్ర బాబు, బలగం శ్రీధర్, దురిశెట్టి కుమార్, బండి చిన్న, వీరస్వామి, రాకేష్, ఇస్లావత్ బాలకిషోర్, జల్లరపు శ్రీను, రామారావు, నవీన్, రవీందర్, కళ్యాణ్, పెద్దిరాజు, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## వనవాసీకు దాతల సహకారం మరువలేనిది

- వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ ఆశాలత



**చర్ల, ఏప్రిల్ 15 :(ప్రజా జ్యోతి ) :**చర్ల మండలంలో బుధవారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సుక్మా జిల్లా కుంట గ్రామానికి చెందిన ఇందన అప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు ఇందన రాంబాబు – వరలక్ష్మి దంపతులు వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ అందచేసారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయం ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత పాల్గొని విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడుతూ ప్రతి విద్యార్ధి చదువులపై దృష్టి సారించాలని, చదువుతోనే పేదరికం దూరమవుతుందన్నారు. ఇందుకు మనకు అనేక ఉదాహరణలు కనపడుతున్నాయని, వారిని ఆదర్శంగా తీసుకొని చదువులపై దృష్టిసారించింది ఉన్నత స్దితికి చేరుకోవాలని విజ్ఞప్తి చేసారు. పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కదాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే విద్యార్థులు ఇందుకు అనుగుణంగా ప్రవర్తించి తల్లిదండ్రులతో పాటు సంస్దకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బా బు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, వనవాసీ జిల్లా సహ సంఘటనా కార్యదర్శి గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## లచ్చాపురంలో దారుణ ఘటన

- అవమానానికి తట్టుకోలేక వృద్ధుడి ఆత్మహత్య

**దమ్మపేట, ఏప్రిల్. 15, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం లచ్చాపురంలో గ్రామంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో, అవమానానికి తట్టుకోలేక ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు పొలిమేర తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నిందితులు తిరువెద్దుల జేమ్స్, గద్దల వెంకట రమణ బాధితుడి ఇంట్లోకి చొరబడి గొడవకు దిగారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడి తండ్రి పొలిమేర వెంకటేశ్వరరావును ఇంటి బయటకు లాగి ప్రజల మధ్య తీవ్రంగా కొట్టడంతో పాటు, ఆయనను అవమానకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ అవమానాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు ఇంటి వెనుక భాగానికి వెళ్లి షెడ్‌లో ఇనుప రాడ్ కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగుతోంది.గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రజల్లో ఆగ్రహం, ఆందోళనకు దారితీసింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, టవళ్లు పంపిణీ



**మణుగూరు, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి) :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం మజ్జిగ ప్యాకెట్లు, టవళ్లు పీఓ భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొకుండా శ్రీసాయి కన్స్ట్రక్షన్స్, జాబ్ వర్క్స కాంట్రాక్టర్లు శ్రీనివాస్, రాజ మనోహర్ లు కార్మికులకు రక్షణ కల్పించే విధంగా ఎండ తీవ్రత వల్ల వచ్చే డీహైడ్రేషన్ ను తప్పించుకునేందుకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టవళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ సిబ్బంది సాంబశివరాజు, హరీశ్ తదితరులు ఉన్నారు.